
స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ చేపట్టారు. సంకష్టహర చతుర్థి వ్రతం సందర్భంగా అనుబంధ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి హోమం వైభవంగా సాగింది. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. సుమారు 22వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.35,10,162 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

## కూరెళ్ల బీపీఎంకు సన్మానం


ఆత్మకూరు(ఎం) కూరెళ్ల బీపీఎం అంజయ్యకు ప్రశంసా పత్రం అందజేస్తున్న పోస్టల్ నల్లగొండ డివిజన్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 27 : మండలంలోని కూరెళ్ల పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో బీపీఎంగా విధులు నిర్వహిస్తున్న మేడి అంజయ్యను భువనగిరిలో శనివారం జరిగిన కార్యక్రమంలో నల్లగొండ డివిజన్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. తపాలా జీవిత బీమాను గ్రామీణ ప్రజల ద్వారా ఆర్‌పీఎల్‌ఐ చేయించి భువనగిరి డివిజన్‌లో 2వ స్థానంలో నిలిచిన అంజయ్యను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్‌పీ భూమయ్య, ఐపీఓ రవికుమార్, బాలకృష్ణ, యాదయ్య, సురేశ్, నర్సయ్య, నవ్యజ్యోతి పాల్గొన్నారు.

## భక్తుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన భక్తుల వద్ద నుంచి డబ్బు వసూలు చేసి చీటింగ్‌కు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. కొండపైన కొబ్బరికాయల షాపులో పనిచేసే యాదగిరి వద్దకు 10 మంది భక్తులు కొబ్బరికాయల కోసం వచ్చారు. ఈ క్రమంలో శీఘ్ర దర్శనం చేయిస్తానని, ఇందుకు రూ.1500 అవుతుందని యాదగిరి నమ్మబలికాడు. నమ్మిన భక్తులు డబ్బులు ఇవ్వగా.. 5 టికెట్లు మాత్రమే కొనుగోలు చేసి తూర్పు రాజగోపురం వద్ద నుంచి వారిని ఆలయంలోకి పంపించే ప్రయత్నం చేశాడు. అక్కడే ఉన్న ఆలయ ఉద్యోగి మనోహర్‌రావు ప్రశ్నించగా.. తాను గుట్ట పట్టణానికి చెందిన వ్యక్తిని అని ఆయనతో వాగ్వాదానికి దిగాడు. ఆలయ ఉద్యోగులను తప్పుదోవ పట్టించి మరో 5 ఉచిత దర్శనం చిట్టీలు రాయించుకుని ఆలయ ఆదాయానికి గండి కొట్టాడు. ఈ విషయంపై భక్తులను విచారించగా మోసపూరితంగా డబ్బు వసూలు చేసినట్లు తేలింది. దేవస్థాన ఈఓ భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు యాదగిరిపై చీటింగ్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఎండలకు తాళలేక బావుల్లో ఈత


మోత్కూరులోని వ్యవసాయ బావిలో ఈత కొడుతున్న యువకులు

మోత్కూరు, ఏప్రిల్ 27 : జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. శనివారం మోత్కూరు ప్రాంతంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెరిగిన ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వడగాల్పులు, ఉక్కపోత తీవ్రత పెరుగడంతో ఏసీలు, కూలర్లకు డిమాండ్ బాగా పెరిగింది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామాల్లో యువకులు వ్యవసాయ బావుల్లో ఈతకు వెళ్తున్నారు. మోత్కూరు పట్టణంలో స్పోర్ట్స్ క్లబ్‌లోని స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లి ఈత కొడుతూ సేద తీరుతున్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 27 : భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం పార్టీ జెండాలను ఎగురవేశారు. యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు గులాబీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నాటి నుంచి ఎన్నో ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిందన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు వెంకటయ్య, నర్సింహ, శ్రీధర్‌గౌడ్, చంద్రం, వాసు, కుమార్, నరసింహారెడ్డి, వీరేశం, బాలయ్య, కన్నప్ప, ఉప్పలయ్య, క్రాంతి, శ్రీను, రాజాలు, సత్తయ్య, నజీర్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గులాబీ జెండాను పార్టీ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్ ఎగురవేశారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎదిగిన విధానాన్ని పలువురు వివరించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు ఢిల్లీ మాధవరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, బాలరాజు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసాచారి, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : బీఆర్ఎస్ ఆవిర్భావం సందర్భంగా మండల కేంద్రంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి గులాబీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చౌగోని సత్యంగౌడ్, నాయకులు రణధీర్‌రెడ్డి, పోగుల నర్సిరెడ్డి, బైరెడ్డి నర్సిరెడ్డి, వెంపల్ల నర్సిరెడ్డి, బాలరాజు, రవి, సైదులు, అరవింద్, పరమేశ్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్సే ప్రజలకు శ్రీరామరక్ష

మోత్కూరు : బీఆర్ఎస్‌తోనే ప్రజలకు శ్రీరామరక్ష అని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో గులాబీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో రైతులు, కార్మికులు, ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణ తగ్గలేదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, జంగ శ్రీను, పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, దాసరి తిరుమలేశ్, గిరగాని శ్రీనివాస్, క్రాంతిరెడ్డి, సాగర్, పరమేశ్, శైలజ, ఇంద్రజ్యోతి, రేణుక, లక్ష్మయ్య, స్వామి పాల్గొన్నారు.


అడ్డగూడూరులో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవగిరి


ఆత్మకూరు(ఎం) : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తన ఇంటిపై గులాబీ జెండాను కడుతున్న పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు అరుణ


యాదగిరిగుట్ట : బీఆర్ఎస్ కార్యాలయంపై పార్టీ జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కాటంరాజు


చౌటుప్పల్ : పట్టణంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు నిరంజన్‌గౌడ్


మోత్కూరు : బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్

## బీజేపీని ఓడిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

- టీపీఎఫ్ జిల్లా గౌరవ సలహాదారుడు బట్టు రాంచంద్రయ్య


ప్రజాస్వామ్య పరిరక్షణ సదస్సు కరపత్రాన్ని విడుదల చేస్తున్న టీపీఎఫ్ జిల్లా గౌరవ సలహాదారుడు రాంచంద్రయ్య

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 27 : ప్రశ్నించిన వారిపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా గౌరవ సలహాదారుడు బట్టు రాంచంద్రయ్య అన్నారు. టీపీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజాస్వామ్య పరిరక్షణ సదస్సు కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, చెప్పిన మాటలను మరిచి దేశాన్ని తీవ్ర సంక్షోభం వైపు తీసుకుపోతుందన్నారు. ప్రజా వ్యతిరేకమైన నోట్ల రద్దు, జీఎస్టీతో చిన్న వ్యాపారులను, రైతులను, కార్మికులను, పేదలను మరింత పేదరికంలోని నెట్టిందని విమర్శించారు. దేశంలో ఉన్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నదన్నారు. అంబానీ, అదానీ, టాటా, బిర్లాలకు అప్పజెప్పి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ సంపన్నుల ఆస్తులు పెంచుతున్నదని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులను అక్రమ కేసులతో అణిచివేస్తున్నదన్నారు. దేశంలో మత ఘర్షణలను లేపి ప్రజా సమస్యలను పక్కన పెడుతుందని పేర్కొన్నారు. ప్రజా సంఘాల నాయకులపై కక్షపూరితంగా ఎన్ఐఏ, ఉపా, రాజద్రోహం కేసులు పెట్టి జైల్లో పెడుతూ రాజ్యాంగ విరుద్ధంగా ఈడీ, సీబీఐని తమ స్వార్థానికి వాడుకుని విపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు. ఇలాంటి కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ కాశపాక మహేశ్, కో కన్వీనర్ కావలి యాదయ్య, నాయకులు రాసాల బాలస్వామి, నంగునూరి రాజు పాల్గొన్నారు.

## క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్

బొమ్మలరామారం, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. పార్టీ మారిన వారి గురించి పట్టించుకోవద్దని, నిజమైన కార్యకర్తలుగా ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి ప్రజలను భారీ ఎత్తున సమీకరించాలన్నారు. బీఆర్ఎస్ అంటే ఇప్పటికీ ప్రజల్లో అభిమానం ఉన్నదని తెలిపారు. సమావేశంలో నాయకులు చిమ్ముల సుధీర్‌రెడ్డి, గూదె బాలనర్సయ్య, కుషంగల సత్యనారాయణ, చంద్రమౌళి, గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్, పాచ్యానాయక్, రామకృష్ణ, మల్లేశ్, శ్రీకాంత్‌గౌడ్, ఉపేందర్, బలరాం, బాలరాజు, బలరాం, వెంకటేశ్, రామకృష్ణ పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో ఏసీ ఏర్పాటు చేయాలి


ఆత్మకూరు(ఎం)లోని ఆరోగ్య కేంద్రం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 27 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ థియేటర్‌లో, ఇన్‌పేషెంట్ వార్డులో ఏసీలు ఏర్పాటు చేయాలని ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, ప్రజలు కోరుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆరోగ్య కేంద్రానికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఆరోగ్య సిబ్బంది వారికి చికిత్సను అందిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ వార్డుల్లో ఇబ్బందులు పడుతున్నామని రోగులు పేర్కొంటున్నారు.

సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆరోగ్య కేంద్రంలో ఏసీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## పెద్దమ్మ ఆలయానికి గోపురం గంటలు అందజేత


కొన్‌రెడ్డిచెర్వు పెద్దమ్మ ఆలయానికి గోపురం, గంటలు పూజా సామగ్రి అందజేస్తున్న మల్లేశ్, భాస్కర్ దంపతులు

రాజాపేట, ఏప్రిల్ 27 : మండలంలోని కొన్‌రెడ్డిచెర్వులో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన ఉచ్చేంతల మల్లేశం, ఉచ్చేంతల భాస్కర్ కంచు గోపురం, గంటలు పూజా సామగ్రిని శనివారం అందజేశారు. ఆలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గోపూజ, గణపతి, హోమ పూజలు నిర్వహించారు. నేడు పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ


కొలనుపాకలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సంతోష్‌గౌడ్

ఆలేరు రూరల్, ఏప్రిల్ 27 : మండలంలోని కొలనుపాకలో ఉపాధి హామీ కూలీలకు గ్రామస్తుడు భీమగోని సంతోష్‌గౌడ్ శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నరేశ్, సంపత్, సారయ్య పాల్గొన్నారు.

### మృతుల కుటుంబానికి ప్రభుత్వ విప్ ఐలయ్య పరామర్శ

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 27 : ఈతకు వెళ్లి మృతిచెందిన మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన తండ్రీకొడుకు బోడ నరేశ్, సాయికుమార్ కుటుంబాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, నాయకులు సిద్ధులు, శ్రీశైలం, అంజయ్య పాల్గొన్నారు.

### మద్యం పట్టివేత

అడ్డగూడూరు, ఏప్రిల్ 26 : మండలంలోని జానకిపురం గ్రామంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు శనివారం తనిఖీలు చేశారు. నర్సింహులు వద్ద నుంచి 15 బీర్లు, 2 ఫుల్ బాటిళ్లు పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసకుంటాయని హెచ్చరించారు.

### తప్పిపోయిన వ్యక్తి మృతదేహం లభ్యం

చిట్యాల, ఏప్రిల్ 27 : ఈ నెల 21న తప్పిపోయిన చిట్యాలకు చెందిన భిక్షం(55) మృతదేహం శనివారం లభించినట్లు ఎస్ఐ డి.సైదబాబు తెలిపారు. భిక్షం ఇంట్లోంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిట్యాలలోని వేణుగోపాల స్వామి వెంచర్‌లోని మురుగు కాల్వలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు మున్సిపాలిటీ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతి చెందింది మేకల భిక్షంగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భిక్షం ప్రమాదవశాత్తు మురుగు కాల్వలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కారు చెట్టుకు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరో ఐదుగురికి తీవ్రగాయాలు


బోయపల్లి రాము (ఫైల్)


ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 27 : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొని యువకుడు మృతిచెందాడు. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన బోయపల్లి రాము (19), జీడిమెట్ల శివ, జీడిమెట్ల సాయి, బోయపల్లి రాకేశ్, మేకల వేణు, దోటి శ్రీకాంత్ కలిసి స్నేహితుడి సోదరి పెండ్లికి మునుగోడుకు శుక్రవారం ఉదయం కారులో వెళ్లారు. వివాహం అనంతరం సరదా కోసం అక్కడి నుంచి దేవరకొండ దగ్గర ఉన్న వైజాగ్‌కాలనీకి వెళ్లారు. శుక్రవారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నారు. రాత్రి కావడంతో ఏమైనా తిందామని చౌటుప్పల్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో నారాయణపురం మండలం చిమిర్యాల – గుడిమల్కాపురం గ్రామాల మధ్య కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. డ్రైవింగ్ చేస్తున్న బోయపల్లి రాము (19) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. కాగా, రాము తండ్రి చిన్నతనంలోనే మృతిచెందగా, అతని తల్లి ఆరు నెలల క్రితం మరణించింది. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. రాముకు ఒక తమ్ముడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

## వ్యవసాయ బావుల కేబుల్ వైరు చోరీ


మోత్కూరులోని వ్యవసాయ బావి వద్ద కేబుల్ వైర్ కత్తిరించిన స్టాటర్.

మోత్కూరు, ఏప్రిల్ 27 : మున్సిపాలిటీ కేంద్రంలోని పలు వ్యవసాయ బావుల వద్ద కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పట్టణంలోని పెద్ద చెరువు కింద ఉన్న వ్యవసాయ బావులు, బోర్ల వద్ద స్టాటర్ నుంచి మోటారుకు వెళ్లే కేబుల్‌ను కత్తిరించి అక్కడే ఉన్న ముళ్ల చెట్ల మాటున కాల్చుకొని అందులోని రాగి తీగను తీసుకెళ్లారని రైతులు తెలిపారు. రోడ్డు వెంటనే తమ బావి ఉన్నప్పటికీ పగలు, రాత్రి సమయాల్లోనూ ప్రజలు తిరుగుతున్నా దుండగులు నాలుగు మోటార్ల కేబుల్‌ను కత్తించుకొని వెళ్లారని వాపోయారు. మూడు, నాలుగు నెలలకో మారు కేబుల్ చోరీ జరుగుతుందని, గతంలో మోటార్లను సైతం పగులగొట్టి అందులోని రాగి తీగను తీసుకెళ్లారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దుండగులను పట్టుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.